# సైనిక విన్యాసం

శ్రీ వాల్ఫ్ డిట్రిక్ ష్నూర్

సైనిక విన్యాసాలకు నిర్దేశించిన ప్రాంతంలో మానవమాత్రుడు ఒక్కడైనా లేడు. ఈ సంగతి వాటి విన్యాసాల నిర్వహణకు నియుక్తుడైన అధికారి (ఆఫీసర్ ఆఫ్ ది డే) కేంద్ర కార్యాలయానికి (హెడ్ క్వార్టర్స్) ఎరుకపరచినాడు. ఎందుకైనా మంచిదని మరి రెండు పర్యాయాలు ఆ ప్రాంతం అంతా నిర్మానుష్యంగా ఉన్నది లేనిది పరీక్షించాలని జనరల్ ఉత్తర్వు చేసిన మాట యథార్థం. తత్ఫలితంగా ఆయన ఆందోళన చెందవలసిన అవసరమేమీ లేదని రుజువు అయినది. ఆ ప్రాంతంలో ఉన్న వ్యవసాయదారుల ఇళ్ళు అన్నీ ఖాళీగా ఉన్నవి. ఇంక విన్యాసాలు ప్రారంభించవచ్చు. మొదట స్టాఫ్ అధికారులు ఉన్న కార్లు బయలుదేరినవి. సైనిక పరిశీలకుల జీపులు వాటిని అనుసరించి బారుగా ముందుకు సాగినవి. ఆఖరిని అంబ్యులెన్సు ఉన్నది. ఆరోజు నిజంగా చాలా ఆహ్లాదకరంగా ఉన్నది. ఆకాశంలో ఎక్కడో రెండు గృధ్రాలు పరిభ్రమణం సాగిస్తూ సూర్యకిరణాలతో దోబూచులాడుతున్నవి. భారద్వాజపక్షులు చిట్టడవి మీద గాలిలో నిశ్చలంగా ప్రేలాడుతూ ఉన్నవి. దారి పొడవునా ప్రక్కనే పొదలలో దాగిఉన్న జెముడుకాకులు, కాంతులీనే బంగారు పిచ్చుకల గుంపులు ఎగిరిపోతున్నవి.

అధికారులు, ఆహూతులు కూడా చాలా ఉల్లాసంగా ఉన్నారు. వారి గమ్యస్థానం దగ్గరలోనే ఉన్నది. ఎంత నెమ్మదిగా వెళ్ళినా ముప్పాతిక గంటలో చేరుకోవచ్చు. అప్పుడే జనరల్ కారు రహదారి విడిచి చిట్టడవిలో ప్రవేశించినది. ముళ్ళపొదలతో నిండి ఉన్న సమోన్నతమైన గుట్టల వరుస దిగువను ఆగినది. తతిమ్మా బండ్లు ఆ కారును అనుసరించినవి. అక్కడ అంతా ఆయత్తంగా ఉన్నది. 'ఫీల్డ్ కుకర్' ఆవిరి చిమ్ముతున్నది. ఆర్డర్లీలు తమతమ పనులలో నిమగ్నులై ఉన్నారు. సిగ్నలర్సు టెలిఫోను తీగలు నేలమీద పరుచుతున్నారు. మడత కుర్చీలు కూర్చోడానికి అమరుగా వేసిఉన్నవి. కూర్చుంటే అనువుగా అందజేసిన ఫీల్డ్ గ్లాసెస్ లోనుంచి దిగువనున్న మైదానం అంతా అవరోధమేమీ లేకుండా చక్కగా కనుపిస్తున్నది.

సైనిక విన్యాసాల క్రమాన్ని సంక్షిప్తంగా వివరించి జనరల్ వాటి కార్యక్రమాన్ని ప్రారంభించాడు. వాటిలో ప్రధానమైనది ఇన్‌ఫెంట్రీ దళాలకు, పాంజర్ దళాలకు జరిగే పోరాటం. జనరల్ ఇంకా యువకుడిలా ఉన్నాడు. ప్రాయశః ఆయన నలభయ్యోపడి ఆఖరిలో ఉండవచ్చు. మాటలు తుంచి తుంచి మాట్లాడినాడు. వైఖరి అలక్ష్యం సూచిస్తున్నది. గొంతులో ఎక్కడో వ్యంగ్యం ధ్వనిస్తూ ఉన్నది. మొత్తంమీద నాటివిన్యాసం అంతా తమాషాగా తను—భావిస్తున్నట్లు అందరు భావించినా లెక్క చేయనట్లు కనుపిస్తున్నాడు. ఏమంటే లుఫ్ట్‌వాఫే (జర్మనీ విమానబలం) అంటూ ఈనాడు లేదు కదా?

సైనిక విన్యాసానికి నిర్దేశించిన ప్రాంతానికి ఉత్తరంగా పండ్లతోటలు ఉన్నవి. దక్షిణాన నదిటెవే ఉన్నది. తూర్పున చిట్టడవి ఉన్నది. ఆ అడవిలో నుంచి ఆవిరి పొగ లేస్తున్నది. అది సుభంగా పర్యవేక్షించగలిగిన ప్రదేశం కాదు. రేగు పొదలతో ముళ్ళ పొదలతో నిండిన అసంఖ్యాకమైన గుట్టలతో కొండచరియలతో నిండిఉన్నది ఆ ప్రాంతం. పైగా ఆ ప్రాంతంలో వ్యవసాయదారుల ఇళ్ళు చాలా ఉన్నవి. అవన్నీ టాంకు విధ్వంసక దళాల నెలవులు కావడానికి ఉద్దేశించినట్లుగా ఉన్నవని అడ్జుటెంట్ అన్నాడు.

అప్పటికి మధ్యాహ్నం అయినది. అధికారులు, ఆహూతులు మధ్యాహ్న భోజనం ముగించారు. ఆర్డర్లీలు అప్పుడే భోజనం పళ్ళాలు తీసుకొనిపోయారు. గాలి స్తంభించినది. ఆకు అయినా అల్లాడడం లేదు. ఆ గుట్టమీద అంతటా నీలిరంగు సిగరెట్ పొగ మేఘాలు

---

వాల్ఫ్ డిట్రిక్ ష్నూర్ జర్మనీ యువరచయిత. బెర్లిన్‌లో ఉత్తమసాహిత్యానికి ఏర్పాటు చేసిన ఫాంటేన్ బహుమతి ఇటీవల ఈయనకు లభించింది.

చిన్నగా పైకి లేస్తున్నవి. ఇప్పుడు భారద్వాజపక్షుల పాటలు, కీచురాళ్ళమోత దూరంగా వినవచ్చే టాంకు ఇంజన్ల రొదతో, పట్టాలుచేసే ధ్వనితో మేళవించినవి. అదే సమయంలో ఆ ప్రాంతంలో అంతటా పొదలు సమూలంగా లేచి కదలినట్లు తోస్తున్నది. వాటి కదలిక గమనించినంతలోనే అవి పరిసరాలలో లీనమైపోతున్నట్టూ తోచింది. కేవలం బంగారు పిచ్చుకల గుంపులు మాత్రం భయంతో అక్కడక్కడ గాలిలోనికి ఎగురుతూ పదాతి (ఇన్ ఫెంట్రి) దళాలు తమతమ స్థానాలు చేరుకొంటున్న సంగతి పట్టిఇస్తున్నవి.

సుమారు అరగంట గడిచేసరికి టాంకుల మొదటి వరుస 'ఫీల్డ్ గ్లాసెస్' తో చూచేవారి దృష్టిపథంలోనికి వచ్చినది. అవి పంటతోటల్లోనుంచి మెల్లగా దారిచేసుకొంటూ ఈవలికి వచ్చినవి. వాటిని ఇన్ ఫెంట్రీకి చెందిన చిన్న చిన్న దళాలు బాహాటంగా అనుసరించివస్తున్నవి. మరికొలది నిమిషాలలో రెండవ సాయుధ శకటసైనికదళం సమాంతర శ్రేణితో చిటపటాన పరిసర ప్రాంతంలో రంగంలో ప్రవేశించినది. సాయుధ శకటాల రణగొణధ్వనిలో భారద్వాజపిట్టల పాట వినిపించడం లేదు. అయినా అవి మునుపటివలెనే ఇంకా గాలిలో తేలి ఆడుతున్నవి కనుక తమ పాట కూడా సాగిస్తూనే ఉండవచ్చు. ఈలోగా ముళ్ళపొదల క్రింద నక్కి ఉన్న ఇన్ ఫెంట్రీ దళాలవారు తమ తమ నియమిత స్థానాలు చేరుకొన్నారు. వ్యవసాయదారుల ఇళ్ళకు సమీప ప్రదేశంలో కూడా టాంకు విధ్వంసక దళాలు, ఇన్ ఫెంట్రీ శతఘ్నిదళాలు కృత్రిమమైన పొదలమాటున, ఆవరణాలమాటున నక్కి కనుపించకుండాపోయినవి.

ఇంతవరకు విసుగెత్తినట్లుగా ఒకప్రక్కగా నిలబడివున్న అధికారులు కూడా తమ ఫీల్డ్ గ్లాసెస్ తీసుకొని విన్యాసం పరిశీలించవలసిన సమయం వచ్చినదని భావించారు. ఏమంటే టాంకులు పిరంగి కాల్పులు ప్రారంభించినవి. మొదట్లో అవి ఆ ప్రాంతమంతటా ఎటుపడితే అటు కాల్పులు సాగించినవి. అంతలో దక్షిణం నుంచి వచ్చే సాయుధ శకటదళం రంగంలో ప్రవేశించినది. దానితో ఆ రెండు దళాలు కత్తెర వ్యూహంలో రెండు పార్శ్వాలుగా తీరినవి. ఆఖరుకు ఈ ఉభయపార్శ్వాలు ఉత్తర దిశనుంచి పురోగమిస్తున్న ఇతర దళాలతో చేరాలి. రెండవ దళం రంగంలో అడుగు పెట్టగానే టాంకుల శతఘ్నిదళాలు నిర్దిష్టమైన లక్ష్యాలపై కేంద్రీకరించి కాల్పులు సాగించనారంభించినవి.

ఇన్ ఫెంట్రీదళాలవారు చిన్నకందకాలు (ఫాక్స్ హోల్స్) త్రవ్వుకొని ఉన్నారు కనుక టాంకులను తమ మీదుగా పోనిచ్చారు. టాంకులలో అధిక భాగం తమను దాటిపోయేవరకు వారు ఊరకే ఉన్నారు. తరువాత ఒక్కసారిగా సైనిక దళము టాంకు విధ్వంసక దళాల ఇన్ ఫెంట్రీ శతఘ్నుల మద్దతుతో గోతులలో నుంచి బయటపడి టాంకులతో పోరాటానికి దిగినది. వాటిలో కొన్నిదళాలు సాయుధ శకటాల ననుసరించి వచ్చే ఇన్ ఫెంట్రీతో చేరినవి. తతిమ్మావారు రకరకాల ప్రత్యేకాయుధాలు వెలికితీసి ఒక్కొక్క టాంకును ఎదిరించసాగారు. టాంకులు ఆత్మరక్షణానికి పూనుకొన్నవి, ఇప్పుడు యుద్ధం ముమ్మరంగా సాగుతున్నది.

కాని దురదృష్టవశాత్తు అంతవరకు స్తంభించి ఉన్న గాలి చెలరేగినది. శతఘ్నులనుంచి పొగ, దుమ్ము ఎరిగా స్టాఫ్ అధికారులు ఉన్న గుట్ట వైపుకు కొట్టుకొని వచ్చినవి. కొలది సేపటివరకు అధికారులకు ఏమీ కనుపించలేదు. రకరకాల పక్షులు భయంతో ఆ గుట్ట పరిసరాలలో ఉన్న ముళ్ళ పొదలలో తలదాచుకొన్నవి. భయం మూలంగా, వాటికి నమ్మకం అధికమై ఉండవచ్చు. లేక ఆ అధికారులు కూడా తమవలెనే భయపడి తలదాచుకొన్న తోడి అటవీవాసులని భ్రమించి ఉండవచ్చు. చిరాకు అణచుకొనడానికి జనరల్ చాలా ప్రయత్నించాడు. కాని సఫలుడు కాలేకపోయినాడు. ఏమైనా గాలి ఆ విధంగా తన ఆనతి ధిక్కరించడం నిజంగా చాలా దుస్సహమైన విషయం. అంతలో అకస్మాత్తుగా తవని తలంపుగా యుద్ధఘోష నిలిచిపోయినది. అదే సమయంలో పెనుగాలి వీచి ధూమ ధూళి మేఘపటలిని పటాపంచలు చేసినది. సమావేశమై ఉన్న అధికారులకు అసాధారణమైన దృశ్యం గోచరమైనది. కత్తెర వ్యూహంలోని ఉభయ పార్శ్వాల టాంకు శ్రేణుల మధ్యన గల చతురపుమైలు మేర మైదానం అంతా గొర్రెలతో నిండివున్నది. అవి భీతితో మతి కోల్పోయినవి. ఒండొంటి తోకలుమోరలతో ఒరసుకొని వలయాలుగా ఆ ప్రదేశమంతా కలయతిరుగుతున్నవి. ఆ వలయాలు ఒండొంటిని ఢీకొని మళ్ళీ వలయాలుగా ఏర్పడి మర్ర

చీలిపోతున్నవి. ఆ గొర్రెల సముద్రంలో చిక్కుపడి ఉన్నవి టాంకులు.

టాంకులు నిలిచిపోయినవి. గొర్రెలను ఆవరించిన భయం పోగొట్టడానికి వాటి ఇంజన్లుకూడా ఆపుచేశారు. తుపాకీ కాల్పులు సహితం అతి విరళంగా నిలుపుచేశారు. సమీపంగా ఉన్న వ్యవసాయదారుల ఇళ్ళ కిటికీల్లోనుంచి తొంగిచూచే సైనికుల ముఖాలు అక్కడక్కడ కనుపిస్తున్నవి. వారు తదేకదృష్టితో ఆశ్చర్యంతో ఆ అపూర్వమైన దృశ్యం తిలకిస్తున్నారు. ఫీల్డ్ గ్లాసెస్‌లో వారి ముఖభాగములుకూడా స్పష్టంగా కనుపిస్తున్నవి. ఇప్పుడు టాంక్ టరెట్స్ తెరుచుకొనసాగినవి. ఒక్కొక్క దానిలోనుంచి నూనెజిడ్డుకారే తలలు రెండేసి మూడేసి బయటికి వస్తున్నవి. ఒక్క క్షణం క్రిందటివరకు ఆ ప్రాంతం అంతా చెవులు చిల్లులుపడే యుద్ధఘోషతో దద్దరిల్లిపోయింది. ఇప్పుడు కేవలం వేలాదిగొర్రెల గిట్టలచప్పుడు మాత్రమే వినిపిస్తున్నది. ఎండి బీటపడిన నేలమీద మేకల పాదఘట్టనం ప్రతిధ్వనిస్తూ అసంఖ్యాకమైన భేరీల నినాదంవలె భీతిగొల్పుతున్నది. మధ్య మధ్య 'బా' అంటూ మంద్రస్థాయిలో గొర్రెలఅరుపు వినవస్తున్నది.

జనరల్ ముఖం కోపంతో జేవురించినది. ఆ ప్రాంతంలో ప్రాణికోటి లేకుండా చూడవలసిన బాధ్యత ఉన్న అధికారివంక చూశాడు.

ఆ అధికారిముఖం వివర్ణమైనది. తడబడుతూ కుంటిసాకులు కొన్ని చెప్పాడు గొర్రెలమంద విన్యాస ప్రాంతం వెలుపలనుంచి ఎక్కడో ఆ ప్రాంతంలోనికి చొచ్చుకొని వచ్చివుండవచ్చునని చెప్తూ తనతప్పు ఏమీ లేదని సమర్థించుకొనడానికి ప్రయత్నించాడు.

విన్యాసాలు తిలకించడానికి ఆహ్వానింపబడిన ఇతరులుకూడా ఆసమయంలో అక్కడ వున్నారని జనరల్ గుర్తుకు తెచ్చుకొన్నాడు. అటకపంమీద తనను నిగ్రహించుకొని ఆ అధికారికి సమాధానం చెప్పకుండా ఊరకొన్నాడు. దానికి బదులు ఫీల్డ్ టెలిఫోన్ అందుకొని కమాండ్ పోస్టుతో మాట్లాడినాడు. గొర్రెలను వెంటనే ఆప్రాంతంనుంచి తరిమి వేయాలని ఆదేశించాడు. ఆ బాధ్యత నిర్వహించవలసిన అధికారులు తదనుగుణంగా ఉత్తర్వులు జారీచేయాలని చెప్పాడు. టెలిఫోన్‌లో మాట్లాడేటప్పుడు జనరల్ గొంతుక వణికిపోయినది.

అక్కడ కమాండ్ పోస్టులో అధికారులు ఒండొరులవంక రెప్ప వాల్చకుండా చూచుకొనసాగారు. దురదృష్టవశాత్తు విచిత్రమైనపరిస్థితి ఏర్పడినదని వారికీ తెలుసు. మతి హీనమైన ఈ గొర్రెమందను తాము ఏ విధంగా తరగగొట్టాలని జనరల్ అనుకొంటున్నాడో వారికి అర్థంకాలేదు. జనరల్ తాను స్వయంగా జరపవలసిన నిర్ణయాన్ని తమకు అప్పగించి చేతులు కడుగుకొనడానికి ప్రయత్నిస్తున్నాడని వారు అనుకొన్నారు. ఏది ఎలా ఉన్నా ఉత్తరపరిహద్దు వెంబడినే ఉన్నటాంకులు శతఘ్ని కాల్పులు జరపాలని వారు ఉత్తర్వు చేశారు. అదే సమయంలో గొర్రెల మందలు పారిపోవడానికి అనువుగా దక్షిణపరిహద్దులో ఉన్నటాంకులు దారి ఇవ్వాలనీ కూడా ఆదేశించారు. ఈ ఉపాయంతో గొర్రెలు అక్కడే కంగారుపడటం మానివేసి బారులుతీర్చి ఏదో విధంగా ఆ ప్రాంతం విడిచి పారిపోగలవని వారు ఆశించారు.

కాని గొర్రెలు సరిగా ఇందుకు భిన్నమైన ఆలోచన చేసినవి. టాంకుల శతఘ్ని కాల్పులతో గొర్రెల మంద ఒక్కసారి మహాభయంతో కంపించిన మాట వాస్తవం. కాని అగ్రగాములుగా ఉన్న గొర్రెలు తాము పారిపోవడానికి ఏర్పాటు అయినదారి చేరుకొనగానే అకస్మాత్తుగా నిలిచిపోయి వెనుక కాళ్ళమీద నిలబడి ఒక్క ఊపున వెనక్కు తిరిగి మహావేగంతో మంద కేంద్రప్రదేశం చేరుకొన్నవి. అవి తొలుతకన్న అధికంగా మతి కోల్పోయినట్లు కనుపించినవి 'ఫాక్స్ హోల్స్' (గోతులు)లో ముడిచిపెట్టుకొని కూర్చున్న సైనికులు (ఇన్‌ఫెన్‌ట్రీమెన్) గొర్రెల కాళ్ళక్రింద పడి నలిగిపోకుండా కాపాడుకొనడానికి చాలా ప్రయాసపడవలసి వచ్చింది.

జనరల్ ఇంక కోపం అణచుకొనలేకపోయాడు. మళ్ళీ కమాండు పోస్టుతో టెలిఫోన్‌లో మాట్లాడినాడు. విన్యాసాలు పూర్తికాగానే అక్కడి అధికారులపై చర్యజరుపుతానంటూ గర్జించాడు ఈలోగా గొర్రెలమందను ఎలా తరిమివేయాలో స్వయంగా చూపుతానని వారితో అన్నాడు. పరిశీలించమని కూడా వారికి చెప్పాడు. అతిథులను విడిచి వెళ్ళుతున్నందుకు జనరల్ వారికి క్షమార్పణ చెప్పుకొన్నాడు. తాను లేని సమయంలో తనకు బదులుగా వ్యవహరించమని నాటి నిర్వహణాధికారి (ఆఫీసర్ ఆఫ్‌దిడే)ని ఆదేశించాడు. గుట్ట దిగి జీప్ దగ్గరికి వెళ్ళాడు. గొర్రెలమంద మధ్యకు—సాధ్యమైనంత మధ్యకు జీప్ పోనివ్వమని డ్రైవరును ఆజ్ఞాపించాడు.

అయితే జీప్ జనరల్ అనుకొన్నంతదూరం వెళ్లలేకపోయినది. టాంకులను చూచి హడిలిపోయి ఉన్న మేకలను, టాంకులతో పోల్చితే, జీప్ అణుమాత్రమైనా లెక్కింపదగినదిగా కనుపించలేదు. గొర్రెలమందను చేరుకొనడమే తడవుగా జీప్ వాటిమధ్య కూరుకొని పోయినది; ముందుకు కాని వెనుకకు గాని కదలడానికి శక్యం కానంతగా కూరుకొని పోయినది.

రెండు సైనికదళాలను (ఇన్‌ఫెంట్రీప్లాటూన్స్) పిలిచి వాటి సహాయంతో గొర్రెలు పారిపోవడానికి ఏర్పాటుచేసిన దారివైపు వాటిని తరిమి వేయా

లని జనరల్ సంకల్పించాడు. ఇప్పుడు జీప్ కదలశక్యం కాకపోవడంతో ఆ పన్నాగడ ఆచరణ సాధ్యం కాదని ఆయన అగత్యకంగా గుర్తించవలసి వచ్చినది. అదే సమయంలో ఆయన తప్పనిసరిగా మరొకటి కూడా గుర్తించక తప్పలేదు. తనమూలంగానే తాను మూర్ఖుడుగా ప్రవర్తించానని ఆయన గుర్తించాడు. వెనకనుంచి మెత్తమీద చురుక్కు మనిపించినది ఆయనకు—విదేశీ సైనిక పరిశీలకులు ఫీల్డ్ గ్లాసెస్ లోనుంచి ఆయనను గమనిస్తూ ఉంటారన్నది సందేహమేమీ లేదు. తన మీద వారు చేసే వ్యాఖ్యలు, ఛలోక్తులు, నవ్వులు ఊహించుకొన్నాడు ఆయన. చెవులు గింగురు మన్నవి. కోపం ఆవహించినది. తాను రెండు ప్రపంచసంగ్రామాలలో పాల్గొన్నాడు. అనేకమైన పోరాటాలలో అనుభవం గడించుకొన్నాడు. ప్రఖ్యాతి చెందినవాడు. అలాంటి తాను మందగా మెలగడం మినహాగా మరేమీ చేతకాని మతివిహీనమైన ఈ గొర్రెలమూలంగా అపహాస్యానికి పాలుకావడమా అని ఆయనకు కోపం వచ్చినది.

కోపావేశంతో ఆయన మొహము వేడెక్కినది. 'ఎక్సిలరేటర్' నొక్కి అధికమైన వేగంతో ముందుకు సాగిపోనివ్వమని కేక వేసి డ్రైవర్‌ను ఆదేశించాడు. డ్రైవర్ ఆయన ఆజ్ఞను శిరసావహించాడు. జీప్ చక్రాలు కీచుమంటూ గిర్రున తిరిగి పోయి బీడు నేలలో ఇంకా లోతుకు దిగినవి. కాని జీప్ కదలలేదు. చుట్టు ముట్టిపట్టి ఉంచిన మేకల బలం ఆ జీప్ హార్స్ పవర్‌కు మించి ఉన్నది. ఆసరికి జనరల్ కోపంతో మతికోల్పోయిన స్థితిలో ఉన్నాడు. 'హోల్‌సర్' (తొడుగు) రివాల్వర్ పైకి లాగినాడు. తోసుకొంటూ చుట్టుముట్టుతూ ఉన్న గొర్రెల మందలోనికి ఎటు పడితే అటు 'మాగజీన్' (గుళ్ళు పెట్టే పట్టీ) ఖాళీ అయ్యే వరకు దానిని పేల్చినాడు. ఆయన రివాల్వర్ కాల్పులు సాగిస్తూ ఉన్న సమయంలో జీప్ ఒక ప్రక్క మెల్లగా భూమిని విడిచి పైకి లేవసాగినది. ప్రశాంతమైన సముద్రంపై తేలి ఆడుతున్నట్లుగా తోచినది. క్రమంగా ఒక ప్రక్కకు ఒరిగినది. దానిని సరిచేయడానికి జనరల్ డ్రైవర్ రెండవ ప్రక్కకు కదిలేలోగా అది మెల్లగా ఎంతో జాగ్రత్తగా ఆ ప్రక్కకు ఒరిగి తలక్రిందులైనది.

తనను త్రొక్కివేస్తున్న అసంఖ్యాకమైన గిట్టలలోనుంచి తప్పించుకొని బయటపడడానికి జనరల్‌కు కొంతకాలం పట్టింది. జీప్ క్రిందనుంచి తన కాళ్లు లాగుకొని ఎట్టకేలకు లేచి నిలబడ్డాడు. తల దిమ్మెత్తి ఉన్నది. చుట్టూ కలయచూచినాడు.

ప్రపంచమంతా గొర్రెలమయంగా ఉన్నట్లు కనుపించినది ఆయనకు. కనుచూపు మేరదూరంలో ఎక్కడ చూచినా ఒకదాని తరువాత ఒకటిగా బొచ్చుతో ఉన్న గొర్రెల వీపులే కానవస్తున్నవి. ఈ బొచ్చుసముద్రంలో టాంకులు చుట్టు ముట్టిఉన్న గొర్రెల వెల్లువలో మునిగిపోనున్న ఉక్కుద్వీపాలవలె కనుపిస్తున్నవి.

అప్పటికికాని తాను, జీప్ ఉన్న ప్రదేశంలో కొలదిమేర ఖాళీ అయినసంగతి జనరల్ గుర్తించలేదు. ఏ కారణం చేతనో గొర్రెలు ఆ ఖాళీప్రదేశంలోనికి రావడానికి జంకుతున్నట్లు, వాటిని ఏదో నిరోధిస్తున్నట్లు కనుపించినది. మోటైనదెబ్బతిని స్మృతి కోల్పోయిపడి ఉన్నాడు డ్రైవరు. అతనికి సహాయం చేయ పూనుకొనబోయాడు జనరల్. అంతలో గొర్రెలు తొక్కని కొలది ఖాళీప్రదేశంలో తాను డ్రైవరు కాక మూడవ ప్రాణికూడా ఉన్నదని జనరల్ గుర్తించాడు. అది ఏనుగుగున్నలా ఉన్న గొర్రెపొట్టేలు. బరువుగా ఊపిరివిడుస్తున్నది అది.

ఆ పొట్టేలు నిశ్చలంగా నిలిచిఉన్నది. బండబారిన వంకర కొమ్ములతల క్రిందికివంచి నిరీక్షించి ఉన్నది. తల బొచ్చులో కూరుకొని ఉన్నది. తెల్లటి కనుగ్రుడ్లలో రక్తపుజీర కనపిస్తున్నది. పనిచేస్తున్న ఇంజన్‌వలె రొమ్ము, ముందుకాళ్ళుకూడా వణుకుతున్నవి. గొంతుమీద తుపాకి గుళ్ల దెబ్బలు చాలా ఉన్నవి. వాటిలోనుంచి కారునలుపురంగుకు మారిన రక్తం ప్రవాహాలుకట్టి జడలుకట్టి గోమారులతో నిండిన బొచ్చులోనికి ప్రవహిస్తున్నది.

జనరల్ వెంటనే పరిస్థితి అర్థం చేసుకొన్నాడు. ఆయన రివాల్వర్ కాల్చి దానిని గాయపరిచాడు. ఇప్పుడు ఉభయులు ప్రాణాలకు తెగించి ఒండొరులను ఎదిర్చి నిలిచిఉన్నారు. ఆయన రివాల్వర్ తీసుకొన్నాడు. కాని దానిలో గుండ్లు లేవు. జాగ్రత్తగా గొర్రెపొట్టేలు మీదనుంచి దృష్టి మరల్చకుండా ఆయన జీప్ వెనకకు నెమ్మదిగా ఒక అడుగు వేశాడు. పొట్టేలు ఎదుటనుంచి జీప్ వెనుకకు తప్పుకొని దానిని చాటు చేసుకోవాలని ఆయన సంకల్పం. కాని శత్రువు కదలడం చూచినది ఆ పొట్టేలు. వెంటనే రెండు అంగలలో ఆయనమీద పడినది. జనరల్ ప్రక్కకు గెంటినాడు. పొట్టేలుతల జీప్‌ను ఢీకొన్నది. అది ఒకసారి తల ఆడించినది. దిమ్మెక్కినట్లుగా నేలవంక చూస్తూ ఒక క్షణంసేపు నిలిచిఉన్నది.

జనరల్‌ను భయం ఆవహించినది. గుండె గొంతుకలో కొట్లాడినది. నుదురు అరచేతులుకూడా చెమటతో తడిసిపోయినవి. కోపం అంతరించినది. కొండ మీదనుంచి గమనించే వారినిగురించి ఆయన ఆలోచించడం విరమించుకొన్నాడు. ఆయన మనస్సులో ఉన్న తలంపు ఒక్కటిమాత్రమే. "ఈ పొట్టేలు నన్ను చంపరాదు; ఈ పొట్టేలు నన్ను చంపరాదు" అనిమాత్రమే. ఆయన ఇప్పుడు జనరల్ కాడు. భయం-

ప్రాణభయం, నిలువెల్లా కంపింపజేసే భయం మూర్తీభవించిన స్వరూపం ఆయన. ఇప్పుడు ఆయనలో భయం మినహాగా మరేమీ లేదు.

గొర్రె పాశేలు మహావేగంతో పక్కకు తిరిగినది. జనరల్ కు కడుపులో ఎక్కడో భరించ శక్యం కాని బాధ తెలియవచ్చినది. తలలో రణగొణధ్వని చెలరేగుతున్నది. వాంతి చేసుకోవలసి వచ్చినది. ఆయన నేలమీదకు క్రుంగిపడేలోగా పాశేలు మరల ఆయన పొత్తికడుపుమీద బలువైన తనవంకర కొమ్ములతో కుమ్మినది. ఇంతవరకు తనను ఇహలోకంతో కట్టివుంచిన బంధం ఏదో తెగిపోతున్నదని జనరల్ కు తెలుసు. తలలో రణగొణధ్వని తారస్థాయిలో వాయులీనంమీద పలికే అనంతమైన స్వరంలో దేనిలోనో లీనమైనది. ఆయన స్మృతి కోల్పోయినాడు.

జనరల్ ప్రాణాపాయకరమైన స్థితిలో ఉన్నాడని ఎవరూ ఊహించలేదు. టాంకుల సిబ్బందిలో కొందరు, కొండమీదనుంచి గమనించే అధికారులు మొదట ఆయన జీప్ను గొఱ్ఱెలమంద కదలనివ్వకుండా చుట్టుముట్టడం, గొర్రెపాశేలు ఆకస్మికంగా ఆయన మీదపడటం చూచినారు. ఆయనకు చిరాకుపుట్టించేది - బహుశా అనుమానకరమైనది ఏదో జరుగుతున్నదని అనుమానించారు. కాని అపాయమూలంగా జనరల్ ప్రాణాపాయం సంభవించవచ్చునని ఒక్కరు కూడా అనుకొనలేదు. అందుచేతనే జనరల్ నేలమీదనుంచి తిరిగి లేవలేక పోయినప్పుడు అధికారుల ఆలోచనలు పరిపరి విధాల విచిత్రమైనపోకడలు పోయినవి. కొందరు దిగువ మైదానంలో జరుగుతున్న దానిని ఉపేక్షించడానికి యావచ్ఛక్తి ప్రయత్నించారు. మరికొందరు ఆ మేకలు సముద్రం తరించిపోయి జనరల్ ను చేరుకొనడం ఎలాగా అని ఆలోచించసాగారు.

ఏమి చేయడానికి అశక్తులు అయిన ఈ బాధాకరమైన స్థితిలోనుంచి అధికారులను చివరికి ఆ మేకలే కాపాడినవి. అంతవరకు మేకలు ఒక పద్ధతి క్రమము లేకుండా అదేపనిగా మహావేగంతో వలయాలు తిరుగుతున్నవి. అలాంటవి ఆకస్మికంగా అనుల్లంఘ్యమైన ఆదేశం దేనినో అనుసరిస్తున్నట్లుగా గొఱ్ఱెల పరిభ్రమణంలో ఒక క్రమం ఒకపద్ధతి గోచరించసాగినది. క్రమంగా గొఱ్ఱెలు అన్నీ ఆ క్రమపద్ధతికి కట్టుబడుతున్నట్లు కనుపించినది. ఈ వలయం అకస్మాత్తుగా వేరొక ముఖం పట్టినది. దానితో గొఱ్ఱెలు అన్నీ ఆ వెలువలో కొట్టుకొని పోయినవి. గొఱ్ఱెలు ఇప్పుడు తూర్పుదిశగా పొగలుచిమ్మే అటవిలోనికి సాగిపోయినవి. రెప్పపాటులో అన్నట్లుగా అసంఖ్యాకమైన ఆ గొఱ్ఱెలమంద ఆకారం అరుణరంజితమైన ధూళితెరమరుగున అదృశ్యమైపోయినది.

విన్యాసాల నిర్వహణాధికారి, కమాండ్ పోస్టునుంచివచ్చిన పలువురు అధికారులు తలక్రిందులైన జీప్ చేరుకొనే సరికి దగ్గరలో ఉన్న టాంకుల సిబ్బంది సహాయంతో మెడికల్ ఆర్డర్లీలు (వైద్యశాఖ ఉద్యోగులు) అప్పుడే జనరల్ మృతదేహాన్ని అల్యూమినియమ్ 'స్ట్రెచర్' మీద ఉంచారు. దానిని ఆంబ్యులెన్సులో ఉంచడానికి తీసుకొని పోతున్నారు. జనరల్ జీప్ డ్రైవర్ కూడా వారికి తోడ్పడినాడు.

అలాంటి పరిస్థితులలో సైనిక విన్యాసాలు తిరిగి సాగించడం పొరపాటు అయినట్లుగానే కనుపించినది. పైగా టాంకులు మొదట ఏ స్థానంనుంచి బయలుదేరినవో ఆస్థానానికి తిరిగి పోవలసివస్తుంది. ఇంతకూ మొదట అనుకొన్న దానికన్న మూడురెట్లు అధికంగా ఇంధనం ఖర్చు అవుతుంది. అందుచేత అక్కడఉన్న అధికారులు అందరిలో సీనియర్ బాధ్యత తీసుకొని విన్యాసాలు విరమించాలని ఉత్తర్వు చేశాడు.

ఆశాభంగం పొందిన అధికారులు తమ తమ మోటారు బండ్ల వద్దకు వెళ్ళారు. డ్రైవరు మోటార్లు 'స్విచ్' చేశారు. క్రమంగా జీపులబారు కదిలి టాంకులను ఇన్ఫెంట్రీ దళాలను దాటి వెళ్ళినవి. ఆఖరుని ఆంబ్యులెన్సు ఉన్నది. టాంకులు, ఇన్ఫెంట్రీ దళాలు తిరిగి బారులు తీరుతున్నవి.

మరి కొద్దిసేపటిలోనే ఇన్ఫెంట్రీ దళాలు కూడా సాగిపోయినవి. వాటిని టాంకు విధ్వంసక శతఘ్ని దళాలు అనుసరించినవి. చివరికి కొండ మీద 'ఫీల్డ్ కిచెన్' బండి మాత్రమే మిగిలినది. దానిలోనికి ఆర్డర్లీలు మడతకుర్చీలు ఎక్కించారు. సిగ్నలరు ఫీల్డ్ టెలిఫోన్ తీగెలు చుట్టబెట్టారు. అది కూడా పూర్తి అయినది. ఫీల్డ్ కిచెన్ బండి డ్రైవర్ ఈలవేయగా అతని అధికారం క్రింద ఉన్నవారందరు బండి ఎక్కినారు. అక్కడ జాగ్రత్తగ నీళ్ళుపోసి ఆర్పివేసిన బూడిదకుప్ప మాత్రమే మిగిలినది. ఫీల్డ్ కిచెన్ బండి నెమ్మదిగా బ్రేకుల సహాయంతో భద్రంగా కొండదిగి వెళ్ళిపోయినది.

సైనిక విన్యాసాలు ప్రారంభమైనప్పుడు ముండ్ల పొదలలో తలదాచుకొన్న పక్షి సమూహాలు ఇప్పుడు ధైర్యంగా వెలికి వచ్చినవి. రెక్కలు అలార్చినవి. తమ దేహాలను చంచుపుటాలతో పటపటి శుభ్రం చేసుకొన్నవి. మైదానం విడిచి గుంపులు గుంపులుగా ఆకాశంలోనికి ఎగిరిపోయినవి. భారద్వాజ పిట్టలు ఇంకా నిశ్చలంగా ఆకాశంలో వ్రేలాడుతూ ఉన్నవి. మరొకసారి కీచురాళ్ళ రొదతో తేనెటీగల ఝుంకారంతో గృధ్రాలసన్నని ఎలుగుతో భారద్వాజ పిట్ట పాట మేళవించినది.

('ఎన్‌కౌంటర్' నుంచి)